కరువునేలపై ఎర్ర బంగారం

- సంద్రడివిలో ఎర్రచందనం సాగు సక్సెస్
- ఔషధ మొక్కల సాగు సైతం విజయవంతం
- ఫలించిన అటవీ శాఖ ప్రయోగం


సంద్రడివిలో ఏపుగా పెరుగుతున్న ఎర్రచందనం చెట్లు

ములకలచెరువు: శేషాచలం అటవీ ప్రాంతంలో విస్తారంగా పెరిగే ఎర్రచందనం చెట్లు ఈ ప్రాంరంలో కూడా మూలాలు వేస్తున్నాయి. దేశంలోనే ఎర్రచందనం చెట్లు శేషాచలం అటవీ ప్రాతానికి కేరాఫ్‌గా మారాయి. స్మగ్లర్ల దోపీడీతో శేషాచలం అడవిలోని నాణ్యమైన ఎర్రచందనం క్రమంగా అంతరించిపోతోంది. దీంతో ఎర్రచందనం పెంపకానికి అనుకూలమైన ప్రాంతాలు, నేలలను గుర్తించడానికి అటవీ శాఖ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఈ ప్రాతంలో ఎర్రచందనం చెట్లు పెరుగుతాయని భావించి చేసిన ప్రయోగం ఫలించింది. ములకలచెరువు మండలం వేపూరికోట, మద్దినాయునిపల్లె పంచాయతీలోని సంద్రడివి ప్రాతంలో ఎర్రచందనం చెట్లు పెరుగుతున్నాయి. కరువు ప్రాంతమైన ములకలచెరువు మండలంలో కూడా పెరుగుతున్న ఎర్రచందనం చెట్లు చూస్తుంటే ఈ ప్రాంతం వందశాతం అనువుగా ఉన్నట్లు తేలింది.

నాటిన అన్ని మొక్కలు బతికాయి

ములకలచెరువు మండలం సంద్రడివిలో 2015 సంవత్సరంలో 6 వేల ఎర్రచందనం మొక్కలు అటవీ శాఖ అధికారులు నాటించారు. ఈ మొక్కల సంరక్షణకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నాటిన మొక్కలు ఎండిపోకుండా వేసవిలో ట్యాంకర్లతో నీటిని అందించారు. అవసరమైన సేంద్రియ ఎరువులను వేశాడు. అధికారులు ఆశించిన విధంగా ప్రతి మొక్క బతికింది. మొక్కలు ఏపుగా పెరిగి చెట్లయ్యాయి. ఎర్రచందనం నాటిన చోట్ల చిన్న కందకాలు తవ్వారు. ఈ కందకాల్లో వర్షపు నీరు నిలిచి చాలా రోజుల వరకు చెట్లకు నీరందుతుంది.

ఔషధ మొక్కల పెంపకం కూడా విజయవంతం

సంద్రడివిలో ఔషధ మొక్కల పెంపకం కూడా విజయవంతమైంది. 2015లో ఎర్రచందనంతో పాటు ఔషధ మొక్కల పెంపకం ప్రారంభించారు. అలోవీర(కలబంద), అడివిగంధి, ఉసిరి, శ్రీగంధం , వేప, అల్లనేరేడు, ఎలగ, తపసి, కుంకుడు మొక్కలు కూడా ఏపుగా పెరిగి చెట్లయ్యాయి. అలాగే 20 ఏళ్ల క్రితం నాటిన నీలగిరి చెట్లు భారీ వృక్షాలుగా మారాయి. సుమారు 500లకు పైగా ఎకరాల్లో నాటిన నీలగిరి మొక్కలు కూడా వంద శాతం బతికి చెట్లయ్యాయి.

కంటికి రెప్పలా కాపాడుకున్నాం

సంద్రడివిలో నాటిన ఎర్రచందనం మొక్కలను కంటికి రెప్పలాగా కాపాడుకున్నాము. మొదట మూడేళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీరు పట్టాము. ప్రస్తుతం చెట్లయ్యాయి. ఇక వర్షాధారంగా చెట్లు పెరుగుతున్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరిన్ని మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటాం.

– జి. మోహన్ మురళి,
అటవీశాఖ సెక్షన్ అధికారి

చుక్కల భూములకు సంపూర్ణ పరిష్కారం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


చుక్కల భూముల రైతులకు పట్టాలను అందిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: దీర్ఘకాలికంగా రైతులు ఎదుర్కొంటున్న చుక్కల భూములకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంపూర్ణ పరిష్కారం చూపించారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో చుక్కల భూముల రైతులకు హక్కు పట్టాలను ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ మండలంలో 4026 మంది రైతులకు చుక్కల భూములు ఉన్నాయని, ప్రస్తుతం ఇవన్నీ నిషేధిత జాబితా నుంచి తప్పించి, వీటిని పట్టాభూములుగా సంపూర్ణ హక్కు కల్పించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వాలు చుక్కల భూములలో రైతులు బాధపడుతున్న పట్టించుకున్న పాపానపోలేదని, నిరుపేద రైతుల ఇబ్బందులు గమనించిన సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చుక్కల భూములకు పరిష్కారం చూపి రైతులను ఆదుకున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, రఘు, అబ్దుల్ కలీమ్, శివారెడ్డి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ


మూలస్థానమ్మకు బోనాలు తీసుకువస్తున్న భక్తులు

కలికిరి: మండలంలోని గుండ్లూరులో వెలసిన దేశాయి మూలస్థానమ్మకు గుండ్లూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల మహిళలు పెద్ద ఎత్తున మేళతాళాలు, భాజాబజంత్రీల నడుమ ఊరేగింపుగా బోనాలు మోసి అమ్మవారికి సమర్పించారు. రాత్రి చాందినీ బండ్లు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకిపురం సీఐ క్రిష్ణయ్య, కలికిరి ఎస్ఐ రహీముల్లా ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గుట్టపాళెం గ్రామ కస్పా నందు వెలసిన పాలేటమ్మ, చీకటిపల్లి గ్రామం రంగనాధపురంలో నడివీధి గంగమ్మకు భక్తులు ఆదివారం బోనాలు సమర్పించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నిమ్మనపల్లె : పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏపీ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి శోభ అన్నారు. ఆదివారం నిమ్మనపల్లె పెద్దమాదిగపల్లెలో పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ నిర్వహించారు. ఈనెల 5వతేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సహజవనరులపై ఆధారపడి అధిక కుటుంబాలు జీవిస్తున్నాయని, అయితే అనేక కారణాలతో వ్యవసాయభూములతో పాటు సహజ వనరులు ధ్వంసమయ్యాయన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, దక్షిణ తెలంగాణలో సీజన్‌లో వర్షాలు కురవక కరువు సమస్యలు ఎదుర్కొంటున్నాయన్నారు. ప్రకృతి అసహజతల కారణంగా, అకాల తుఫానుల వల్ల పంటలు, పండ్లతోటలు నేలకొరిగి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రజలు పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఒక చెట్టును నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట


అమ్మవారి విగ్రహప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. అమ్మవారి విగ్రహ పత్రిష్ట కార్యక్రమాలు గత మూడురోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం గణపతి హోమం,శ్రీ లక్ష్మీనారాయణ ,శ్రీరామ, శ్రీ వీరాంజినేయ మూల మంత్ర హోమాలు,శ్రీసుబ్రమణ్యేశ్వర, చండీ హోమాలు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి కళశ ఉద్వాసన, కుంభాభిషేకం, ఫల పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం,మహాపూర్ణాహుతి కావించారు. ఎమ్మెల్యేకు నిర్వాహకులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చింతల శివానందరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఎల్వీ రమణ, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, నాయకులు సురేష్, శ్రీనివాసులు రెడ్డి, జ్యోతిరెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో బహుజన స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు, అన్నమయ్యజిల్లాల బహుజన స్టూడెంట్ యూనియన్ అధ్యక్షులు శ్రీనాథ్ మాట్లాడుతూ.. సేవాకార్యక్రమాల్లో భాగంగా ఆస్పత్రిలోని రోగులకు యూనియన్ ఆధ్వర్యంలో అన్నదానం చేసినట్లు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారంతో పాటు సేవాకార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హరి, శివ, నరేష్, రెడ్డిమోహన్, సతీష్, కదిర్ బాషా, బాసిత్, అన్వర్‌బాషాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగ జాతర

నిమ్మనపల్లె : మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం గంగజాతరలు ఘనంగా జరిగాయి. మండలంలోని అగ్రహారం, రెడ్డివారిపల్లె, బండమీదపల్లె గ్రామస్తులు స్థానిక గ్రామదేవతలైన నలవీరగంగమ్మ, పోలరమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. దీలు, బోనాలు సమర్పించారు. అలాగే వెంగంవారి పల్లె, తవళం పంచాయతీ ఎగువపల్లె, నిమ్మనపల్లె పంచాయతీ దేవళంకురవపల్లె, ముష్టూరు పంచాయతీ వలసపల్లె, ముష్టూరు తదితర గ్రామాల్లో శని, ఆదివారాల్లో జాతర ఉత్సవాలు కోలాహలంగా నిర్వహించారు. బంధుమిత్రుల రాకతో గ్రామాలు కళకళలాడాయి. రెడ్డివారిపల్లె, బండమీదపల్లె, అగ్రహారంలో జరిగిన జాతరకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి హాజరయ్యారు.

పీటీఎం సీహెచ్‌ఓ సరోజాదేవి మృతి


సరోజాదేవి (ఫైల్)

బి.కొత్తకోట: పెద్దతిప్పసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పని చేస్తున్న పి.సరోజాదేవి (60) ఆదివారం సాయంత్రం బి.కొత్తకోట సీహెచ్‌సీలో చికిత్సపొందుతూ మృతి చెందింది. బి.కొత్తకోటలో నివాసముంటున్న సరోజాదేవికి శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నాయి. ఇంటిలో ఉన్న ఆమె అస్వస్థతకు గురికావడంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు సత్యమూర్తి, స్టాఫ్‌నర్సు వరలక్ష్మి ఆమెకు వైద్యసేవలు ప్రారంభించిన 20 నిమిషాల్లో ఆమె మృతి చెందారు. అనంతరం మృతదేహాన్ని స్వస్థలం చిత్తూరుజిల్లా పుంగనూరుకు తరలించారు. సరోజాదేవి మృతికి వైద్య,ఆరోగ్యశాఖ వైద్యులు, ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

మహాసభలను విజయవంతం చేయండి

కేవీపల్లె : ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు రాయచోటిలో నిర్వహించనున్న ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సాంబశివ అన్నారు. ఆదివారం మండలంలోని జిల్లేళ్లమంద పెద్దతాండాలో మహాసభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా అడవిబిడ్డల ఆక్రందనలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ప్రకృతి సిద్ధ అటవీ ఉత్పత్తుల సేకరణకు వెళ్లే గిరిజనులపై అటవీ, పోలీస్ అధికారులు కేసులు బనాయిస్తూ జైలుపాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ మిగులు భూములు గిరిజనులకు పంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, ఏపీ గిరిజన సమాఖ్య నాయకులు మదన్‌గోపాల్, రెడ్డిఈశ్వరి, రెడ్డినాయక్, రాజశేఖర్, వీరానాగయ్యనాయక్, రెడ్డెమ్మ, సాయమ్మ పాల్గొన్నారు.

కనులపండువగా ద్రౌపది కల్యాణం

మదనపల్లె సిటీ: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని మైదానంలో ఆదివారం మహా భారతయజ్ఞం కార్యక్రమంలో భాగంగా ద్రౌపది కల్యాణం కనుల పండువగా జరిగింది. ప్రాంగణంలో పాండవులు, ద్రౌపది విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. భాగవతారిణి స్వర్ణలత మహాభారతంలో ద్రౌపది కల్యాణ ఘట్టాలను హరికథ రూపంలో వివరించారు.

ట్రాఫిక్ పోలీసులు బాధ్యతతో పనిచేయాలి


ట్రాఫిక్ నిర్వహణపై సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : ట్రాఫిక్ పోలీసులు బాధ్యతతో అప్రమత్తంగా పనిచేయాలని డీఎస్పీ కేశప్ప అన్నారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో నూతనంగా ట్రాఫిక్ విభాగానికి కేటాయించిన పోలీసులకు ఎండ నుంచి రక్షణ పొందేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన టోపీలను సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మదనపల్లెలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు 20మంది పోలీసులను ట్రాఫిక్ విభాగానికి ప్రత్యేకంగా కేటాయించారన్నారు. ఈ విభాగంలో నియమితులైన పోలీసులు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో టర్న్ అవుట్ కలిగి ఉండి అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. వీఐపీలు పర్యటించే సమయంలో రద్దీ ఎక్కువగా ఉన్న ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ఇన్‌చార్జ్ ఏఎస్ఐ రెడ్డెప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యంతోనే రైలుప్రమాదం

– వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్

మదనపల్లె : ఒరిస్సా రాష్ట్రంలోని బాలాసోర్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రైలు ప్రమాదానికి బాధ్యతారాహిత్యమైన మోదీ ప్రభుత్వ విధానాలే కారణమని విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే) పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ ఆరోపించారు. ఆదివారం స్థానిక వీసీకే కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వం రైల్వేల ప్రైవేటీకరణకు పూనుకుని శాశ్వత ఉద్యోగ నియామకాలు నిలుపుదల చేసిందని, దీంతో రైల్వేశాఖలో ఉద్యోగుల కొరత ఎక్కువై ఉన్న ఉద్యోగులకు పని భారం పెరిగిందని చెప్పారు. సంపన్నుల సౌకర్యం కోసం వందేభారత్ నడుపుతున్నారే కానీ, సామాన్య జనం నిత్యం ప్రయాణించే జనరల్, స్లీపర్ బోగీలను పెంచడం లేదన్నారు. రైలు ప్రమాద దుర్ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటుగా కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ శాశ్వత ఉద్యోగం ఇవ్వాలన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటుగా రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గొర్రెల కాపరికి ఎన్‌ఆర్‌ఐల ఆర్థిక సాయం


గొర్రెల కాపరికి నగదు అందజేస్తున్న ఎన్ఆర్ఐలు

ములకలచెరువు: మండలంలోని పెద్దపాళ్యంకు చెందిన అల్లాబక్షుకు చెందిన 15 గొర్రెలు గత నెల 30న పిడుగుపాటుకు మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో కదిరినాయునికోటకు చెందిన ఎన్ఆర్ఐలు గిరిధర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి ఆదివారం బాధితుడికి రూ.30 వేల నగదును ఆర్థిక సాయంగా అందించారు. అలాగే వేపూరికోటలోని హరిజనవాడలో వెలసిన రామాలయం అభివృద్ధికి రూ.30 వేల నగదును ఆలయ కమిటీకి అందజేశారు.

కరాటేతో మానసిక, శారీరక దారుఢ్యం


క్రీడాకారులతో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు రూరల్ : కరాటేతో మానసిక, శారీరక దారుఢ్యం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లె రోడ్డులో సమ్మర్ జేకేడీ కుంగ్‌ఫూపై శిక్షణ ఇచ్చారు. ఆదివారం పీలేరు, మదనపల్లె, ప్రొద్దుటూరుకు చెందిన సుమారు వంద మంది విద్యార్థులు బ్లాక్ బెల్ట్ కాంపిటీషన్ పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో కరాటే శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరాటే మస్టార్ దామోదర్ మాట్లాడుతూ నలుగురు బ్లాక్ బెల్టులు, 20 మంది ఎల్లో, ఆరుగురు ఆరెంజ్, నలుగురు చొప్పున బ్లూ, బ్రౌన్, మెరూన్, 24 మంది గ్రీన్, 30 మంది వైట్ బెల్టులు సాధించినట్లు తెలిపారు.

వైభవంగా గొడ్రాతమ్మ తిరునాల

బి.కొత్తకోట: మండలంలోని తుమ్మణంగుట్టలో వెలసిన గొడ్రాతమ్మ తిరునాల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా ఎస్ఐ కే.రామమోహన్ బందోబస్తు నిర్వహించారు. తుమ్మణంగుట్ట, గోళ్లపల్లె, బండారువారిపల్లె, శీలంవారిపల్లె పంచాయతీల నుంచి భక్తులు తరలివచ్చారు.

క్రిష్ణయ్య మృతి పార్టీకి తీరనిలోటు

కలకడ : సింగర క్రిష్ణయ్య (65) మృతి వైఎస్సార్‌సీపీకి తీరనిలోటని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ, కొత్తగాండ్లపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సింగర క్రిష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని కొత్తగాండ్లపల్లె గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ శ్రీదేవి, నాయకులు రవికుమార్, బాబురెడ్డి, భీమయ్య, జయప్రకాష్, రాజన్న, తదితరులు నివాళి అర్పించారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె,సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం చేశారు.

నేడు జేఎన్‌టీయూ వీసీ రాక

కలికిరి : అనంతపురం జేఎన్‌టీయూ వీసీ రంగజనార్దన్ సోమవారం కలికిరి జేఎన్‌టీయూ కళాశాలకు రానున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.వి. సత్యనారాయణ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కళాశాల ఆడిటోరియంలో అధ్యాపకులు, మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులతో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. విద్యార్థులు, అధ్యాపకులు విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రైల్వే ఇంటర్న్‌షిప్‌కు మిట్స్ విద్యార్థులు

కురబలకోట: మండలంలో అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం బిటెక్ మూడో సంవత్సరం విద్యార్థులు 30 మంది భువనేశ్వర్‌లోని ఈస్ట్‌కోస్ట్ రైల్వేస్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ యువరాజ్ ఆదివారం తెలిపారు. నెల పాటు వీరు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా రైల్వే వ్యవస్థ, పనితీరు, వినియోగించే పరికరాలపై అధ్యయనం చేయడంతో పాటు రైల్వేస్ గురించి ప్రయోగాత్మకంగా తెలుసుకుంటారన్నారు.

ఎర్రగుంట్ల గంగమ్మకు ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండ అటవీ ప్రాంతంలో వెలసిన ఎర్రగుంట్ల గంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ఉపవాసం చేసి దీలు,బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అభిషేకాలతో మొక్కులు తీర్చుకున్నారు. పూర్వం నుంచి పొలిమేరు సరిహద్దులోని గంగమ్మకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


మదనపల్లె సిటీ: జీఆర్టీ పూర్వపు విద్యార్థులు


తంబళ్లపల్లె: గురువులతో పూర్వ విద్యార్థులు


కురబలకోట: పూర్వ విద్యార్థులు

మదనపల్లె సిటీ: జీఆర్టీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలకు పూర్వ వైభవం తెస్తామని పాఠశాల పూర్వ విద్యార్థి, పాఠశాల కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు అన్నారు. ఆదివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్టీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సమావేశం జరిగింది. సమావేశంలో ప్రసాదరావు మాట్లాడుతూ 1888లో పాఠశాల గిరిరావు స్థాపించారన్నారు. 140 ఏళ్లకు పైబడిన పాఠశాలలో ఎంతో మందికి చదువు నేర్పించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందన్నారు. పాఠశాల కోసం పూర్వ విద్యార్థులందరూ కలిసి చేతులు కలిపి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని కోరారు.

ఏపీఎండీసీ తరపున రూ.10లక్షలు

పాఠశాలలో టాయిలెట్లు, మరమ్మతు పనులకు ఏపీఎండీసీ తరపున ఆ సంస్థ చైర్‌పర్సన్ జీ.షమీంస్లాం రూ.10లక్షలు నిధులు మంజూరు చేయించారన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థినిగా తనవంతు సహాయం అందించారన్నారు.

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లె ఉన్నత పాఠశాలలో 1988–89 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో అపూర్వ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను శాలువలతో సత్కరించి పాదపూజ చేసి గురువుల ఆశీస్సులు పొందారు. అనంతరం గత స్మృతులను గుర్తుచేసుకున్నారు

కురబలకోట: కురబలకోట జెడ్పీ హైస్కూల్‌లో 1991–92లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం హైస్కూల్‌లో కలిశారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వారు 32 ఏళ్ల తర్వాత కలుసుకున్న వీరు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.చదువుకున్న తరగతి గదులతో అనుబంధాన్ని తలచుకున్నారు.